## రెప్పపాటు కాలం..
# ఉండదిక అంతరాయం

- విద్యుత్ సరఫరాలో లోపాలను అధిగమించేందుకు చర్యలు
- నిజామాబాద్ జిల్లాలో 71 గ్రామాలు ఎంపిక
- పల్లెలను దత్తత తీసుకున్న ట్రాన్స్‌కో ఇంజినీర్లు
- రూ. 8.09 కోట్లతో మరమ్మతులు
- చురుగ్గా కొనసాగుతున్న ఆధునీకరణ పనులు
- విడుతల వారీగా మిగతా గ్రామాల్లోనూ పనులు

నందిపేట్, జూలై 19 : రానున్న రోజుల్లో రెప్పపాటు కాలం కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం ట్రాన్స్‌కో ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. గృహ, వ్యవసాయ, పారిశ్రామిక అవసరాలకు అందించే విద్యుత్ సరఫరాలో వాతావరణ ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆటంకం కలగకుండా ట్రాన్స్‌కో యంత్రాంగం చర్యలు చేపట్టింది. మొదటగా జిల్లాలో అర్బన్ ప్రాంతాలు, గ్రామాలు కలుపుకొని 71 గ్రామాలను గుర్తించారు. వీటిని ట్రాన్స్‌కో ఏఈ, ఏడీ, డీఈలు దత్తత తీసుకున్నారు. మొదటి విడుతగా ఈ గ్రామాల్లో ఆధునీకరణ పనులు చేస్తున్నారు. వీటి ద్వారా వచ్చిన ఫలితాలతో మిగతా అన్ని గ్రామాల్లోనూ అంతరాయం లేని సరఫరా అందించేందుకు కింది నుంచి పైస్థాయి అధికారుల వరకు కలిసి పనిచేస్తున్నారు. సరఫరాలో ఉన్న లోటుపాట్లు, పురాతన లైనింగ్ వ్యవస్థ, ఈదురు గాలుల తీవ్రతకు వైర్లు ఒకదానికి ఒకటి తగిలి మంటలు రావడం, లైన్లకు చెట్ల కొమ్మలు అడ్డురావడం, సరైన గద్దెలు లేక ట్రాన్స్‌ఫార్మర్లు పక్కకు ఒరిగిపోవడం, శిథిలావస్థకు చేరిన స్తంభాలు పడిపోవడం, లోడ్ పెరిగినప్పటికీ పాత ట్రాన్స్‌ఫార్మర్లతోనే కాలం వెల్లదీయడం ఇలా ఆయా కారణాల రీత్యా తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడం పరిపాటిగా మారుతున్నది. పైస్థాయిలో ఏవైనా సాంకేతిక లోపాలు వస్తే తప్ప స్థానికంగా ఏ సమస్య రాకుండా ఉండేందుకు ఆధునీకరణతో లైనింగ్ ప్రక్రియను చక్కదిద్దుతున్నారు.

**ఏఈ నుంచి డీఈ వరకు...**

జిల్లాలో ఉన్న ట్రాన్స్‌కో ఇంజినీర్లు ఏఈ నుంచి డీఈ స్థాయి వరకు ఒక్కొక్కరు ఒక్కో గ్రామం, అర్బన్‌లో కాలనీలను దత్తత తీసుకున్నారు. గ్రామాలతో పాటు ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్ మున్సిపాలిటీలతో పాటు నిజామాబాద్ నగరంలో కాలనీలను దత్తత తీసుకున్నారు. దత్తత తీసుకున్న అధికారి పనులు పూర్తయ్యే వరకూ బాధ్యతగా పనులను పర్యవేక్షించాలి. ఆ అధికారి ఈ ప్రాంత సిబ్బందితో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలను గుర్తించి, ఎక్కడెక్కడ ఏమేమి అవసరమో గుర్తించి అంచనాలు వేశారు. ఇప్పుడు ఆ ప్రకారంగా పనులు జరుగుతున్నాయి.

**రూ. 8 కోట్ల 9 లక్షల వ్యయంతో..**

ఓవర్ లోడ్ ఉన్న చోట ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం, ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెలు శిథిలావస్థకు చేరిన చోట కొత్తగా పిల్లర్ వేసి గద్దెలు నిర్మిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు ఉండే ఏ,బీ స్విచ్‌లు ఎక్కడైనా చెడిపోయి ట్రాన్స్‌ఫార్మర్ ఆన్,ఆఫ్ కాకపోతే వాటి స్థానంలో కొత్త స్విచ్‌లు అమర్చడం, ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ సరిచేయడం, వదులుగా ఉన్న విద్యుత్తు వైర్లను లాగి సరిచేయడం, అంతేకాకుండా భూమి నుంచి తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను పైకి లేపడం, భూమి నుంచి ఎల్‌టీ లైన్ 19 ఫీట్లు, 11 కేవీ లైన్ 20 ఫీట్ల ఎత్తులో ఉండేలా.. ఎత్తు తక్కువ ఉన్న స్తంభాల స్థానంలో ఎక్కువ ఎత్తు ఉన్న కొత్త స్తంభాలను మారుస్తున్నారు.

వంగిపోయిన స్తంభాలను సరిచేయడం, తుప్పు పట్టి చెడిపోయిన ఇనుప స్తంభాలు, శిథిలావస్థకు చేరిన సిమెంట్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటుచేయడం. స్తంభాలకు సపోర్ట్ వైర్ ఏర్పాటు, ఈదురు గాలులు వచ్చినప్పుడు చెట్లు లైన్లకు తాకకుండా చెట్ల కొమ్మలను తొలగించడం, సామర్థ్యం పెరిగిన చోట అవసరాన్ని బట్టి కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేయడంతో పాటు పాత ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం సరిపోకపోతే దాని స్థానంలో ఎక్కువ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చడం తదితర పనులు చేస్తున్నారు. ప్రధానంగా ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, విద్యుత్ లైన్ల వల్ల ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు ఈ పనులకు గాను రూ. 8 కోట్ల 9 లక్షలు వెచ్చిస్తున్నారు.

**నందిపేట్ మండలంలో 3 గ్రామాలు**

నందిపేట్ మండలంలో మూడు గ్రామాలకు అవకాశం దక్కింది. ఏఈ జ్ఞానేశ్వర్ ఉమ్మెడ గ్రామం, ఏడీ అశోక్ అయిలాపూర్, డీఈ ఎం.శ్రీనివాస్ నందిపేట్ గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. స్థానిక ఏఈ జ్ఞానేశ్వర్ ప్రత్యేక శ్రద్ధ వహించి కృషి చేయడంతో మూడు గ్రామాలు ఎంపికయ్యాయి. ఒక్క మండలంలో మూడు గ్రామాల్లో విద్యుత్ ఆధునీకరణ పనులు జరగడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



శిథిలావస్థకు చేరిన స్థానంలో నూతనంగా నిర్మిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ గద్దె

### ఈ నెలాఖరులోగా పనులు పూర్తి

దత్తత తీసుకున్న గ్రామాల్లో జరుగుతున్న పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేస్తాం. పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 60 శాతానికి పైగా పూర్తయ్యాయి. ఈ పనులతో విద్యుత్ సరఫరాలో అంతరాయానికి ఆస్కారం ఉండదు. ఈ దత్తత గ్రామాల ఫలితాల బట్టి మిగిలిన మిగతా గ్రామాల్లో పనులు చేపడతాం.

-ఆర్.రవీందర్, ట్రాన్స్‌కో ఎస్ఈ, నిజామాబాద్

# ఆర్మూర్‌లో దారుణం..



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్



రాజవ్వ , గంగవ్వ (ఫైల్ )

- అక్కాచెల్లెళ్ల హత్య
- బంగారం కోసమే ఘాతుకానికి పాల్పడినట్లు అనుమానాలు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్

ఆర్మూర్, జూలై19 : వృద్ధులైన అక్కాచెల్లెళ్లను దారుణంగా హతమార్చి ఆపై ఇంటికి నిప్పుపెట్టిన సంఘటన ఆర్మూర్ పట్టణంలో కలకలం రేపింది.

పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మగ్గిడి గ్రామానికి చెందిన రాజవ్వ (72), గంగవ్వ (62) అనే అక్కాచెల్లెళ్లు 20 ఏండ్లుగా పట్టణంలోని జిరాయత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. గంగవ్వ భర్త ఇటీవల మృతి చెందాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు దుబాయ్‌లో ఉండగా, చిన్న కుమారుడు ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో నివాసం ఉంటున్నాడు. అందరూ కలిసి ఆదివారం మల్లన్న గుట్ట వద్ద నిర్వహించిన పండుగలో పాల్గొన్నారు. సోమవారం మామిడిపల్లిలోనే ఉన్న రాజవ్వ, గంగవ్వను మంగళవారం కుమారుడు జిరాయత్‌నగర్‌లో వారి నివాసం వద్ద వదిలిపెట్టాడు. బుధవారం వేకువజామున ఇంట్లో నుంచి పొగలు రావడంతో గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. కిటికీలు బద్దలు కొట్టి మంటలు ఆర్పే క్రమంలో అక్కాచెల్లెళ్లు హత్యకు గురైనట్లు గమనించి ఆర్మూర్ పోలీసులకు సమాచారం అందించారు. ఇద్దరి తలలపై మోది హత్య చేసిన అనంతరం నిప్పు పెట్టినట్లు భావిస్తున్నారు. ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్‌రావు, ఎస్‌హెచ్‌వో సురేశ్‌బాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆనంతరం క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ బృందాలు ఆధారాలను సేకరించాయి. వీరిద్దరి ఒంటిపై సుమారు 20 నుంచి 25 తులాల వరకు బంగారం ఉంటుందని స్థానికులు తెలిపారు. నగల కోసమే దుండగులు వీరిని హత్య చేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఉన్న సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తిస్తామని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని జిల్లా ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# భారీ వర్షాల నేపథ్యంలో టీఎస్‌ఆర్టీసీ అప్రమత్తం

**డ్రైవర్లు, కండక్టర్లకు జాగ్రత్తలపై సూచనలు చేసిన చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్**

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ డ్రైవర్లందరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. విధి నిర్వహణలో ఏమాత్రం అలసత్వం వహించవద్దని సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. ఆర్టీసీ సంస్థ ఎంతో కాలంగా ప్రయాణికుల భద్రతకు మారుపేరుగా నిలిచిందన్నారు. ఆర్టీసీ సంస్థలో సుశిక్షితులైన డ్రైవర్లు ఉన్నారని, అయినా వర్షకాలంలో భద్రతా నియమాలను పాటిస్తూ సురక్షిత డ్రైవింగ్ చేయడం ఎంతైనా అవసరమన్నారు.

▪ వర్షం కురుస్తున్నప్పుడు వేగ నియంత్రణ పాటించాలి ▪ మలుపుల వద్ద ఇండికేటర్‌ను ఉపయోగించాలి ▪ ముందు వెళ్లే వాహనాలతో సురక్షిత దూరాన్ని పాటించాలి. దట్టమైన వర్షం ఉన్నచోట హారన్ ఉపయోగించాలి. ▪ వర్షం కురుస్తున్నప్పుడు వైపర్ వాడాలి.వైపర్లను కండీషన్‌లోఉంచు కోవాలి. బస్సు వేగాన్ని తగ్గించి నిదానంగా వెళ్లాలి ▪ చెరువులు, కుంటలు నిండిన చోట నీటి ప్రవాహాన్ని పరిశీలించి జాగ్రత్తగా వాహనాన్ని నడపాలి. నదులు, కల్వర్టులు ఎక్కువ నీటి ప్రవాహం ఉంటే ఎట్టి పరిస్థితుల్లో దాటే ప్రయత్నం చేయవద్దు. ▪ విండ్ స్క్రీన్ గ్లాసులను వైపర్‌తో బయటవైపు శుభ్రపరచాలి. లోపల వైపు ఏదైనా క్లాత్‌తో శుభ్రపరచాలి ▪ డ్యూటీకి బయల్దేరే ముందే వైపర్, హెడ్‌లైట్స్ పనితీరు పరిశీలించుకోవాలి ▪ రోడ్డు మరమ్మతులో ఉన్నపుడు బస్సును నిదానంగా నడిపించాలి. డ్యూటీకి వచ్చే ముందు తగిన విశ్రాంతి తీసుకోవాలి ▪భారీ వర్షం కురుస్తున్న సమయంలో ఇతర వాహనాలను ఓవర్ టేక్ చేయరాదు ▪ సడన్‌బ్రేక్ వేయకూడదు. వర్షం పడుతున్నప్పుడు తప్పకుండా లైట్లు వేసి వాహనాన్ని నియంత్రణలో నడపాలి ▪వర్షం కురుస్తున్న సమయంలో ఎదురుగా వచ్చే వాహనదారులతో ప్రమాదం జరిగే అవకాశం ఉన్నది. కనుక ఎట్టి పరిస్థితుల్లో రాంగ్‌రూట్‌లో వెళ్లరాదు. అకస్మాత్తుగా బస్సు దిశను మార్చకూడదు ▪ అకస్మాత్తుగా ఇండికేటర్ వేయకూడదు. బ్రేక్ సిస్టమ్ నుంచి ఎలాంటి ఎయిర్ లీకేజీలు ఉన్నాయో గమనించాలి. ఘాట్‌రోడ్డులో ఎట్టి పరిస్థితుల్లోనూ బస్సును న్యూట్రల్ చేసి నడపకూడదు ▪ బస్సులో ఫుట్‌బోర్డు ప్రయాణాన్ని నివారించాలి ▪ఫోన్ మాట్లాడుతూ..ఒంటిచేత్తో డ్రైవింగ్ చేయవద్దు. ఎంతో పేరున్న ఆర్టీసీ సంస్థ..ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా, డ్రైవర్లు, కండక్టర్‌లు సురక్షితంగా బస్సులు నడిపి సంస్థకు సహకరించాలని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ సూచనలు జారీ చేశారు.

## టీయూలో మరోసారి ఏసీబీ అధికారుల విచారణ

ఇందల్వాయి, జూలై 19 : తెలంగాణ యూనివర్సిటీలో ఏసీబీ అధికారులు బుధవారం మరోసారి విచారణ చేపట్టారు. అప్పటి వీసీ ప్రొఫెసర్ రవీందర్ గతనెల 17న హైదరాబాద్‌లోని తన నివాసంలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలకు పరీక్షా కేంద్రం కేటాయింపు కోసం రూ.50వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన సంగతి తెలిసిందే. అదేరోజు ఏసీబీ అధికారులు వర్సిటీలో సోదాలు నిర్వహించారు. కంట్రోలర్ అరుణను వర్సిటీకి పిలిపించి విచారణ జరిపారు. పరీక్షల విభాగంలోని పలు రికార్డులను పరిశీలించారు. ఏసీబీ అధికారులు బుధవారం ఉదయం 11.30 గంటలకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరిని కలిశారు. అనంతరం కంట్రోలర్ అరుణను విచారణ కోసం పిలిపించారు. పరీక్షా కేంద్రాల కేటాయింపు ప్రొసీజర్ ఎలా ఉంటుంది, ఎవరు కేటాయిస్తారు. గతంలో ఏయే కళాశాలలకు పరీక్షా కేంద్రాలు కేటాయించారు. పరీక్షా కేంద్రాల కేటాయింపు, రద్దు విషయాల్లో వీసీ రవీందర్ ఏమైనా ఒత్తిడి చేశారా అంటూ ప్రశ్నలు అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి వెళ్లిపోయారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**పాస్‌పోర్ట్ పోయినది**

★ నేను,KOVURI PRAVEEN KUMAR .S/o. KOVURI THIRUPATHI, R/O. H.NO:1-87,గ్రా॥లచ్చపేట్ , మం॥ మాచారెడ్డి, జి॥ కామారెడ్డి. నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెంబర్ N2612150 గలది. లచ్చపేట నుండి మాచారెడ్డి మండల కేంద్రానికి బైక్‌పై వెళ్ళుచుండగా పడిపోయినది. ఎవరికైనా దొరికినచో సంప్రదించ గలరు. Cell: 9030143299
NTZ-308844

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

**CHANGE OF NAME**

★ I, DHURISHETTY UGANDHARA CHARY, S/o. Dhurishetty Venkata Ramana Chary, R/o. 8-215/5, Arya Nagar, Nizamabad, TS, Changed My Name as YUGANDHARA CHARY DHURISHETTY.
NT-315712

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.